నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | గురువారం 4 జనవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


# ఆదర్శమహిళ సావిత్రీబాయి పూలే



సావిత్రీ పూలే చిత్రపటానికి పులమాల వేస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్, జనవరి 3: మహిళా లోకానికి ఆదర్శం సావిత్రీబాయి పూలే అని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి పేర్కొన్నారు. శ్రీరాంపూర్ గనులు, డిపార్ట్‌మెంట్లపై బుధవారం సావిత్రీపూలే 193వ జయంతి నిర్వహించారు. జీఎం ఆఫీస్‌లో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి సేవా అధ్యక్షురాలు రాధాకుమారి, జీఎం పూలమాల వేసి నివాళులర్పించారు. మహిళలకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఎస్‌వోటూ జీఎం రఘుకుమార్, డీవైజీఎం అరవిందరావు, ఏజీఎం మురళీధర్, డీవైజీఎం చిరంజీవులు, ఎస్సీ లైజన్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, సర్వే ఆఫీసర్ వెంకటేశం, లా మేనేజర్ శిరీషారెడ్డి, లా ఆఫీసర్ ప్రభందిత, డీవైపీఎం రాజేశ్, సీనియర్ పీవో కాంతారావు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ కవితను కలిసిన జాగృతి నాయకులు

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో జాగృతి నాయకులు



సీసీసీ నస్పూర్, జనవరి 3: భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను మంచిర్యాల జిల్లా జాగృతి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో కవితను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జాగృతి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఎమ్మెల్సీ కవిత సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాగృతి నాయకులు ఐద ప్రశాంత్, కందుల ప్రశాంత్, లక్ష్మణ్, మున్నా, సాయి, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే నివాసంలో అయ్యప్ప పడిపూజ

- హాజరైన ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్

ఆసిఫాబాద్, జనవరి 3 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని స్థానిక ఎమ్మెల్యే కోవలక్ష్మి నివాసంలో మంగళవారం రాత్రి అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. గూడెం అయ్యప్ప ఆలయ పూజారి పురుషోత్తమాచారి పూజ నిర్వహించగా, కోవ సోనేరావు, లక్ష్మి దంపతులు పూజలో పాల్గొన్నారు. రకరకాల పండ్లు, డ్రై ఫ్రూట్స్, పండ్ల రసాలు, పంచామృతాలతో స్వామికి అభిషేకం నిర్వహించారు. మంచిర్యాలకు చెందిన కళకారుల బృందం భజన ఆద్యంతం భక్తులను అలరించింది. స్వామికి పల్లకీసేవ చేస్తూ మాలధారులు పేటతుల్లి ఆటలతో హోరెత్తించారు. ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ దంపతులు, నాయకులు మర్సుకోల సరస్వతి, కోవ సాయినాథ్, జడ్పీటీసీ కోవ అరుణ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు చంద్రమోహన్, వినాయక్, మోహన్, శ్యాంసుందర్, శ్రీనివాస్, సంతోష్, బాలరాము, చిట్టిమల్ల సంతోష్, దూడల అశోక్, మడావి శ్రీనివాస్, వెంకట్‌గౌడ్, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, సోనేరావ్ దంపతులు

# కలెక్టర్‌ను కలిసిన అధికారులు



కలెక్టర్ బదావత్ సంతోష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తహసీల్దార్లు

హాజీపూర్, జనవరి 3 : మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్‌ను జిల్లాలోని తహసీల్దార్లు కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అధికారులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. హాజీపూర్ తహసీల్దార్ సతీశ్ కుమార్, ఇత్యాల కిషన్, సంతోష్ కుమార్, దత్తు ప్రసాద్ తదితరులున్నారు.

**జిల్లా అటవీశాఖ అధికారులకు..**

జిల్లా అటవీశాఖ కేటీఆర్ సర్కిల్ ఫారెస్టు కన్జర్వేటర్ శాంతారాం (ఐఎఫ్ఎస్), జిల్లా అటవీశాఖ అధికారి శివ్ ఆశిష్ సింగ్‌ను జిల్లా తెలంగాణ నాన్ గెజిటెడ్ (టీఎన్జీవో) ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గడియారం శ్రీహరి బుధవారం అటవీశాఖ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పూల మొక్కను అందజేశారు. టీఎన్జీవో అటవీ శాఖ సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు, టీఎన్జీవో కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, మంచిర్యాల యూనిట్ అధ్యక్షులు నాగుల గోపాల్, సంయుక్త కార్యదర్శి వెంకటకృష్ణ, రవి కిరణ్ రెడ్డి తదితరులున్నారు.



తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, వేదికపై మాజీ మంత్రులు అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, జోగు రామన్న, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, జాదవ్ అనిల్, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

# గెలుపు బీఆర్ఎస్‌దే..

## నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి..

- కాంగ్రెస్ హామీలను ప్రజలకు వివరించాలి..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తెలంగాణ భవన్‌లో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం

ఆదిలాబాద్, జనవరి 3(నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గ స్థానాన్ని బీఆర్ఎస్ పార్టీ భారీ మెజారిటీతో కైవసం చేసుకుంటుందని, ఈ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. గులాబీ శ్రేణులు ఓటమితో నిరాశ చెందకుండా ఆత్మస్థైర్యంతో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ స్థానాల్లో బీఆర్ఎస్‌కు మెజారిటీ వచ్చిందని, ప్రజలు బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. లోకసభతోపాటు స్థానిక, మున్సిపల్ ఎన్నికలకు కార్యకర్తలు సన్నద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాలు ముగిసిన అనంతరం అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా సమావేశాలు ఉంటాయని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీని సంస్థాగతంగా గ్రామ, మండల, జిల్లా స్థాయి కమిటీలు వేసి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి బలోపేతం చేస్తామని సూచించారు.

**అందరితో చర్చించి అభ్యర్థుల ప్రకటన**

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల ఓటమి గల కారణాలను విశ్లేషించుకుని, లోపాలను సవరించుకుని ముందుకు పోదామని కేటీఆర్ స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో ప్రజలకు తెలంగాణ ఎంపీల గెలుపు ఆవశ్యకతను వివరించాలని కోరారు. తెలంగాణ ప్రయోజనాలకు శ్రీరామరక్ష బీఆర్ఎస్ పార్టీయే అని తెలుపాలని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ గళం వినిపించడానికి గులాబీ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని విషయాన్ని ప్రజలు వివరించాలని సూచించారు. ఎంపీ అభ్యర్థుల ఎంపిక విషయంలో పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని నాయకులు, కార్యకర్తలతో చర్చించి వారి అభిప్రాయాల మేరకు అభ్యర్థులను ప్రకటిస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీలతోపాటు 420 హామీలను ఇచ్చిందని, హామీల పుస్తకాన్ని అందరికీ అందజేస్తామని, వాటిని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల గ్లోబల్ ప్రచారాన్ని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టాలని, పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ సాధించిన అద్భుత ప్రగతిని ప్రజలకు వివరించాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ అదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, ఆసిఫాబాద్, బోథ్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, అనిల్ జాదవ్, ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ ఎమ్మెల్యే కోనేరు కొనప్ప, ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు



గూడెం ఎత్తిపోతల పథకం



తానిమడుగు వద్ద 30వ డిస్ట్రిబ్యూటరీ కాలువ

# యాసంగికి గూడెం ఎత్తిపోతల నీరు

## ఈనెల 6న విడుదల..

- 2 టీఎంసీలందించేలా ఏర్పాట్లు
- నీటిపారుదల శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమావేశం

దండేపల్లి, జనవరి 3: దండేపల్లి మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణ స్వామి ఎత్తిపోతల పథకం నుంచి ఈనెల 6న నీటిని విడుదల చేయనున్నారు. జిల్లా కేంద్రంలో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు నీటి పారుదల శాఖ అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో నీరందించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే చాలా మంది రైతులు వాగులు, చెరువులు, వ్యవసాయ బావుల కింద నాట్లు వేస్తున్నారు. ఎల్లంపెల్లి జలాశయం బ్యాక్ వాటర్‌ను గూడెం ఎత్తిపోతల నుంచి విడుదల చేయడంపై స్పష్టత రాకపోవడంతో చాలా చోట్ల రైతులు నార్లు పోసుకొని సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారు. అధికారుల ప్రకటనతో ఇక పనులు ఊపందుకోనున్నాయి. హాజీపూర్, లక్షెట్టిపేట, దండేపల్లి మండలాల పరిధిలోని రైతులకు మేలు చేకూరనున్నది.

**రెండు టీఎంసీల నీరందించేలా..**

ఎల్లంపెల్లి జలాశయం బ్యాక్ వాటర్‌ను గూడెం ఎత్తిపోతల ద్వారా కడెం 30వ డిస్ట్రిబ్యూటరీ కాలువ వద్ద వదులుతున్నారు. హాజీపూర్, లక్షెట్టిపేట, దండేపల్లి మండలాల పరిధిలోని 30 వేల ఎకరాలకు ఎత్తిపోతల ద్వారా సాగునీరు ప్రతి యేటా అందిస్తున్నారు. కొత్తగా వేసిన పైపులతో రెండు సార్లు ట్రయల్ రన్ విజయవంతం కావడంతో నీటిని విడుదల చేయనున్నట్లు అధికారులు ప్రకటన చేశారు. ప్రస్తుతం ఎల్లంపెల్లి జలాశయం 148 మీటర్ల పూర్తి సామర్థ్యానికి 145.98 మీటర్ల నీటి మట్టం ఉంది. ఇది 137.6 మీటర్లకు తగ్గితే ఇబ్బందికరంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆరో తేదీ నుంచి 90 రోజుల పాటు మొత్తం రెండు టీఎంసీల నీటిని అందించాలని నిర్ణయించారు.

**30వేల ఎకరాలకు సాగునీరు..**

గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా ప్రతి యేటా 30వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందుతున్నది. ఎల్లంపెల్లి జలాశయ నిల్వ నీటిని(బ్యాక్ వాటర్)గూడెం సమీపంలోని గోదావరి తీరాన నిర్మించిన ఎత్తిపోతల పథకం ద్వారా యాసంగికి నీటిని అందిస్తున్నారు. గూడెం ఎత్తిపోతల పథకం నీటిని మండలంలోని తానిమడుగు సమీపంలోని కడెం ప్రధాన కాల్వలో 30వ డిస్ట్రిబ్యూటరీ వద్ద ఎత్తిపోస్తారు. అక్కడి నుంచి కిందికి 42 కాల్వ వరకు దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల పరిధిలోని 30 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది.

**రైతులు పొదుపుగా వాడుకోవాలి..**

*ఈనెల 6 నుంచి గూడెం ఎత్తిపోతల ద్వారా ఎల్లంపెల్లి నీటిని యాసంగి సాగుకు విడుదల చేయనున్నాం. నీటి మట్టం గతేడాది కంటే ఈసారి ఎల్లంపెల్లి జలాశయంలో తక్కువగా ఉన్నందునా, ఆయకట్టు రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలి. 90 రోజుల పాటు రెండు టీఎంసీల నీటిని విడుదల చేస్తాం. రైతులు సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలి.*

**- వెంకటేశ్వర్లు, డీఈఈ, లక్షెట్టిపేట సబ్ డివిజన్**

# గిరి వ్యవసాయం

## జిల్లాలో ప్రత్యేకంగా 'గిరి వికాసం' పథకం

- విద్యుత్‌తో పాటు సాగునీటి వసతి కల్పన
- ఒక్కో యూనిట్‌కు రూ. 3.50 లక్షల ఖర్చు
- 1,591 మంది దరఖాస్తులు

*కుమ్రం భీం ఆసిఫాబాద్, (నమస్తే తెలంగాణ)/ కెరమెరి, జనవరి 3 : గిరిజనులకు సాగులో అండగా నిలిచేందుకు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ చర్యలు చేపట్టింది. దీనికోసం ప్రత్యేకంగా 'గిరి వికాసం' పథకాన్ని అమలు చేస్తున్నది. దీని ద్వారా గిరిజనులు సాగు చేసుకునే భూములకు సాగు నీరు, విద్యుత్, తదితర వసతులను వంద శాతం రాయితీపై ప్రభుత్వం అందిస్తున్నది. జిల్లాలో ఈ పథకానికి రూ. 6 కోట్లను కేటాయించింది. ఒక్కో యూనిట్ కు రూ. 3.50 లక్షలు ఖర్చు చేయనుండగా, గిరిజన రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.*

జిల్లాలో గిరిజన రైతులకు సాగునీరు అందించేందుకు గిరివికాసం ద్వారా గిరిజన సంక్షేమ శాఖ రూ. 6 కోట్లను మంజూరు చేసింది. గిరిజన రైతులకు వంద శాతం ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పించడంతోపాటు బోర్లు వేసి సాగునీరందించేందుకు అవసరమైన అన్ని రకాల వసతులు కల్పిస్తారు. జిల్లాలో చెరువులు, బోర్ల ద్వారానే అధికంగా వ్యవసాయం చేస్తుంటారు. బోర్లు వేసుకునే ఆర్థిక స్థోమత లేనివారు కేవలం వర్షాలపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. ఇలాంటి రైతులకు వంద శాతం రాయితీతో ప్రవేశపెట్టిన గిరివికాస పథకం వరంలా మారింది. బీడు భూముల్లో బోరు బావులు తవ్వించడం, విద్యుత్ కనెక్షన్లు ఇప్పించడం, మోటర్ల ద్వారా సాగునీరు అందించేందుకు అన్ని రకాల వసతులు కల్పిస్తారు. పదెకరాలకు ఒక యూనిట్‌ని అమలు చేస్తున్నారు. ఐదెకరాలు కలిగిన ఇద్దరు రైతులు లేక అంతకంటే తక్కువ భూమి కలిగిన ఇద్దరు లేక ముగ్గురు రైతులు పక్కపక్కన ఉన్న వారిని కలిపి ఒక యూనిట్‌ని అమలు చేస్తారు. గతంలో ఐడీటీపీ ద్వారా గిరిజన రైతుల భూముల్లో తవ్వి వదిలేసిన బావులను కూడా గిరి వికాసం ద్వారా వినియోగం లోనికి తీసుకువచ్చేందుకు అవకాశం కల్పించారు.

**1,591 మంది గిరిజనులు..**


జిల్లాలో 1591 మంది గిరిజనులు దరఖాస్తు చేసుకున్నారు. 295 మంది రైతుల భూములను భూగర్భ జల శాఖ అధికారులు సర్వే చేశారు. 119 మంది రైతుల చేళ్లలో బోర్లు వేయించారు. 60 మంది రైతుల బోర్లకు విద్యుత్ వసతితో పాటు మోటార్లను బిగించారు. ఈ రైతులు 24 గంటల ఉచిత విద్యుత్‌ను వినియోగించుకుంటూ పంటలు పండించుకుంటున్నారు. మిగతా రైతులందరికీ మార్చిలోగా పథకాన్ని అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒక్కో యూనిట్‌కు రూ. 3.50 లక్షల వరకు ఖర్చుచేస్తారు. ఈ పథకంలో కొలాం, మన్నేవార్, తోటి గిరిజనులకు ప్రథమ ప్రాధాన్యం కల్పిస్తున్నారు.



**సంతోషంగా ఉంది**

మా చేనుకు ఉచితంగా సాగునీటి వసతి కల్పించిన్రు. చాలా సంతోషంగా ఉంది. గిరి వికాసం ద్వారా రూపాయి కూడా ఖర్చులేకుండా సాగునీటి కోసం అన్ని వసతులు కల్పించిన్రు. మాకు ఉన్న ఐదెకరాల్లో గోధుమ పంట సాగు చేస్తున్నాను. గిప్పుడు వానకాలంలో పత్తి, కంది వేశాం. ఈ పంటలు తీసిన తరువాత బోరు నీళ్లతో ఇక నుంచి కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తాం.

**- ఆర్ ప్రకాశ్, అనార్‌పల్లి, కెరమెరి మండలం**



**ఉచితంగా నీటి వసతి కల్పించిన్రు..**

మాకు రెండున్నరెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇంత కాలం సాగునీటి వసతి లేకపోవడంతో పంటలు సరిగా పండించలేకపోయాం. ప్రభుత్వం గిరి వికాసం ద్వారా మాకు ఉచితంగా బోరు వేయించి కరెంటు వసతి కల్పించింది. దాదాపు రూ. మూడు లక్షలతో మాకు సాగు నీటి వసతి కల్పించింది. గిప్పుడు పూర్తిస్థాయిలో పంటలు పండించుకోగలుగుతున్నం. ప్రస్తుతం జొన్న పంట సాగు చేస్తున్న.

**- జాదవ్ ధన్‌రాజ్, అనార్‌పల్లి, కెరమెరి మండలం**

# రామగుండం సీపీగా శంకర్ చౌహాన్



సీపీ శంకర్ చౌహాన్

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 3: రామగుండం నూతన పోలీసు కమిషనర్‌గా ఎల్ శంకర్ చౌహాన్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో 23 మంది ఐపీఎస్‌ల బదిలీ చేయగా, ఇక్కడ సీపీగా ఉన్న రెమా రాజేశ్వరిని హైదరాబాద్‌లోని మహిళా రక్షణ విభాగం డీఐజీగా ట్రాన్స్‌ఫర్ చేశారు. ఆమె స్థానంలో జోగులాంబ గద్వాల జోన్‌కు డీఐజీగా ఉన్న శంకర్ చౌహాన్ ఇక్కడికి వస్తున్నారు. ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గ్రూప్-1 అధికారిగా పనిచేశారు. 2009లో ఐపీఎస్‌గా ఉద్యోగోన్నతి పొందారు. గతేడాది ఫిబ్రవరిలో డీఐజీగా ప్రమోషన్ పొంది, జోగులాంబ గద్వాల జోన్‌కు నియమితులయ్యారు. అలాగే గోదావరిఖని సబ్ డివిజనల్ డీఎస్పీగా 2001 నవంబర్4 నుంచి 2004 జూన్2 వరకు పనిచేశారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ సహదేవరావు

# ఓటరు జాబితా సవరణ పకడ్బందీగా నిర్వహించాలి

- కుమ్రం భీం జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు

ఆసిఫాబాద్,జనవరి 3: ఓటరు జాబితా సవరణ కార్యక్రమం -2024ను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో బుధవారం ఆసిఫాబాద్, కాగజ్ నగర్ ఆర్డీవోలు కదం సురేశ్, కాసబోయిన సురేశ్‌లతో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా సవరణ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సవరణ కార్యక్రమాన్ని అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల కోసం సిర్పూర్ నియోజకవర్గ పరిధిలో 27, ఆసిఫాబాద్ నియోజకవర్గ పరిధిలో 52 సహాయక పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈనెల 20, 21వ తేదీల్లో పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

**దరఖాస్తు చేసుకోవాలి**

గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయంలో బుధవారం సాంఘిక సంక్షేమ గురుకులాల అధికారులతో కలిసి ప్రవేశ పరీక్ష సంబంధిత వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఫిబ్రవరి 11న నిర్వహించే ఈ ప్రవేశ పరీక్ష కోసం ఆన్‌లైన్‌లో ఈ నెల 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు హెల్ప్ లైన్ నంబర్ 1800 425 45678లో సంప్రదించాలని కోరారు. సాంఘిక సంక్షేమ గురుకులాల ఆర్సీవో స్వరూపారాణి, డీసీవో బాలరాజు, ప్రిన్సిపాళ్లు సంధ్యారాణి, జ్యోతి, శ్రీనాథ్, సంగీత తదితరులు పాల్గొన్నారు.